సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం : 24 : సెప్టెంబర్ : 2024



భక్తుల మనోభావాలతో ఆటలా?

శ్రీవారి ఆలయంలో లఘు సంప్రోక్షణ, మహా శాంతి హోమం చేయడం భక్తుల్లో ఆందోళన కలిగించింది. అపచారం ఏమైనా జరిగిందా అన్న సందేహాలు కలిగాయి. 8లో ▸



దేవదాయశాఖ ఈఓల బదిలీలు

దేవదాయశాఖ కాకినాడ జోన్ పరిధిలో పనిచేస్తున్న పలువురు గ్రేడ్-1, 2, 3 ఈఓలను బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. 8లో ▸



పొగాకు సాగుకు సన్నద్ధం

జిల్లాలోని ఏజెన్సీ, మెట్ట ప్రాంతంలో పొగాకు సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పొగాకు రైతులు ముమ్మరంగా నారుమడులు కడుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

అర్జీలకు శాశ్వత పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): అర్జీదారులు సంతృప్తి చెందేలా అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశిత సమయంలో శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

- భీమవరం మండలం గూట్లపాడుకి చెందిన పలువురు తమ గ్రామంలో మంచినీటి చెరువు ఆక్రమణకు గురైందని, నీళ్ల దుర్వాసన వస్తున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.
- తణుకులోని పాతూరుకు చెందిన మద్రె నవీన్ బాబు తమ ప్రాంతంలోని చర్చి ప్రాంగణంలో ఇరిగేషన్ భూమి సర్వే చేయకుండా నిర్మాణాలు చేపడుతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు

భీమవరం(ప్రకాశం చౌక్): ఇరిగేషన్, డ్రైనేజీ పనులను నూరు శాతం నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. 45 ఇరిగేషన్ పనులకు రూ.4.81 కోట్లు, 35 డ్రెయినేజీ పనులకు రూ.5.92 కోట్లు కేటాయించామన్నారు. కాలువలు, డ్రెయిన్లపై ఉన్న షట్టర్లు, స్లూయిజ్ గేట్ల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అలాగే కాలువలు, డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. జలవనరుల శాఖ ఈఈ ఎం.దక్షిణామూర్తి, జిల్లా డ్రైనేజీ శాఖ ఈఈ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

హైవే బాధితుల ఫిర్యాదు



కలెక్టర్‌ను కలిసిన హైవే బాధితులు

భీమవరం(ప్రకాశం చౌక్): కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చినా నేషనల్ హైవే ఈఈ తమను టార్గెట్ చేసి సర్వేకు అధికారులను పంపించి ఆందోళనకు గురిచేస్తున్నారని భీమవరం 38వ వార్డుకు చెందిన బాధితులు కలెక్టర్‌కు మీ కోసంలో ఫిర్యాదు చేశారు. తమ వార్డు మీదుగా హైవే నిర్మాణం చేపట్టాలని హైవే అధికారులు చూడగా కోర్టులో పోరాటం చేస్తే తమకు అనుకులంగా కోర్టు తీర్పు వచ్చిందన్నారు. దీంతో హైవే ఉన్నత అధికారులు కూడా ప్రస్తుతం ఉన్న బైపాస్ రోడ్డును ఉపయోగించుకోవాలని సూచించారని అయినా నేషనల్ హైవే ఈఈ సర్వేకు అధికారులు పంపించి ఆందోళన గురి చేస్తున్నారని వాపోయారు. కోర్టు తీర్పు ఉందని అధికారులకు చెప్పినా మాస్టర్ ప్లాన్‌లో కూడా హైవే ఉన్నట్టు ఇచ్చారని దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ షురూ

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన పలు రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం భూసేకరణ ప్రారంభించనుంది. దీనికి సంబంధించి కేంద్ర రైల్వేశాఖ సోమవారం గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసింది. ఏలూరు జిల్లాలోని వట్లూరు-ఏలూరు స్టేషన్ల మధ్య లెవల్ క్రాసింగ్ నం.347కి బదులుగా రోడ్డు ఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం-నవాబ్‌పాలెం స్టేషన్ల మధ్య లెవల్ క్రాసింగ్ నం.378కి బదులుగా రోడ్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు.

స్వర్ణాంధ్ర-2047 పోస్టర్ ఆవిష్కరణ

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రూపొందిస్తున్న స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్‌లో జిల్లాస్థాయి ప్రణాళిక ప్రస్ఫుటంగా ఉండేలా ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి సూచనలు సలహాలు స్వీకరిస్తున్నామని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర-2047 పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 లక్ష్య సాధన కోసం ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

17 ఫిర్యాదుల స్వీకరణ

భీమవరం: భీమవరంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 17 ఫిర్యాదులు స్వీకరించారు. ఏఎస్పీ బి.భీమారావు బాధితుల నుంచి వినతులు స్వీకరించి చర్యలకు ఆదేశించారు.

పెల్లుబికిన ఆగ్రహం

రఘురామకృష్ణరాజు దిష్టిబొమ్మల దహనం

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొనసాగిన ఆందోళనలు
- దళిత సంఘ నేతలపై పోలీసుల ఉక్కుపాదం
- నిరసనలను అణచివేసేలా హౌస్ అరెస్టులు

భీమవరం: బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించేసిన పశ్చిమగోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని ఉమ్మడి పశ్చిమ జిల్లావ్యాప్తంగా సోమవారం నిరసనలు వెల్లువెత్తాయి. పలు ప్రాంతాల్లో రఘురామకృష్ణరాజు దిష్టిబొమ్మలు దహనం, అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. సోమవారం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కలెక్టర్, ఎస్పీలకు గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేయడం, భారీ రాస్తారోకో చేస్తారనే సమాచారంతో పోలీసులు దళిత నేతలపై ఉక్కుపాదం మోపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మాలమహానాడు, ఎంఆర్‌పీఎస్‌తో పాటు ఇతర దళిత సంఘాల నేతలు హౌస్ అరెస్టులు చేశారు. అలాగే భీమవరంలోని కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఏఎస్పీతో సహా 50 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం వేకువజాము నుంచే దళిత సంఘాల నాయకుల ఇళ్ల వద్ద పోలీసులు మోహరించి గృహ నిర్బంధాలు చేశారు. పోలీసులు పెద్ద సంఖ్యలో భీమవరం చేరుకున్నారు. పలు సంఘాల నాయకులు కలెక్టర్ సీహెచ్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మీలకు వినతిపత్రాలు అందజేశారు. భీమవరంలో దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సుందరకుమార్‌ను, మాల మహానాడు నరసాపురం డివిజన్ అధ్యక్షుడు, నియోజకవర్గ మాలల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి కాకిలేటి ఆనందకుమార్ (మధు)ను, పాలకొల్లు హౌసింగ్ బోర్డులో నివాసం ఉంటున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్‌ను, ఆచంట వేమవరంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్, పలువురు దళిత నేతలను పోలీసులు హౌస్ అరెస్టులు చేశారు.



చింతలపూడి: రఘురామకృష్ణరాజు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మండవల్లి: మండవల్లిలో అంబేడ్కర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సభ్యులు కె.శాంతరాజు, ఎల్ఎస్ భాస్కరరావు, పాగోలు, గోరింక గాంధీ, కె.రవిప్రసాద్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉవ్వెత్తున నిరసన

బుట్టాయగూడెం: ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ మండలం ముప్పినవారిగూడెంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో దళితులు సోమవారం ధర్నా చేశారు. కేవీపీఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ రఘురామకృష్ణరాజు వివాదాస్పద వ్యాఖ్యలు హిందువులను రెచ్చగొట్టి వారిని దళితులపైకి ఉసుకొలిపేలా ఉన్నాయన్నారు. రఘురామకృష్ణరాజుపై సుమోటాగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆడమల్లి సోమరాజు, క్లెం సుందరరావు, అందుగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

రఘురామకృష్ణరాజు క్షమాపణ చెప్పాలి



ముదినేపల్లి: అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

ముదినేపల్లి రూరల్: ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు వెంటనే క్షమాపణ చెప్పాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగజగన్ బాబురావు, అనుబంధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దళిత సంఘాల కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్‌ను కులవివక్షతతో అవమానించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. దీనిపై అంబేడ్కర్ పాదాల సాక్షిగా ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మాదిగ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసుపోగు దానియేలు, దాసరి మణి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాల వద్ద మాలమహానాడు నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు.



భీమవరం: 'పశ్చిమ' కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా

ఏలూరు (టూటౌన్): ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజును తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ మాల జాతి యోధుల పోరాట సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి మెండెం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ వీధి రౌడీలా ఎస్సీలపై ఎమ్మెల్యే విరుచుకుపడ్డారని విమర్శించారు. ఇరువర్గాలను కూర్చోబెట్టి సమస్యను సామరస్యంగా పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధి ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. అనంతరం కలెక్టర్ వెట్రి సెల్వి ద్వారా సీఎం చంద్రబాబుకు వినతిపత్రం పంపారు. దాసరి శ్యాం, నూకపెయ్యి కార్తీక్, ఎరికిపాటి విజయ్, అబ్బూరి అనిల్ బాబు, బొల్లారపు నాగరాజు, గారపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు పెట్టాలి

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం గణేష్ సెంటర్‌లో అంబేడ్కర్ అభిమాన సంఘాలు, మాల మహానాడు, దళిత సంఘాలు, ఇతర సామాజికవర్గాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దిష్టిబొమ్మను దహనం చేశారు. రఘురామకృష్ణరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాల్సిందిగా కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. దళితులను రెచ్చగొట్టేలా రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. రొక్కాల నాగరాజు, కరటూరి అబ్రహం, కరుటూరి చంటి, బొగ్గవరపు బాబురావు, తొర్లపాటి వాసు, బి.జానీ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు (టూటౌన్): ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మాలజాతి యోధుల పోరాట సంఘం నాయకులు



పాలకొల్లు అర్బన్: మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్‌ను బయటకు వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు



పెనుగొండ: గృహ నిర్బంధంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పుష్పరాజ్



కొయ్యలగూడెం: రఘురామకృష్ణరాజు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత నాయకులు

ప్రజల కష్టాల్లోంచి పుట్టిందే వైఎస్సార్‌సీపీ

పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



తణుకులో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ముదునూరి. చిత్రంలో మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ప్రజల కష్టాలను చూసే వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందని, ప్రజల కోసం ఉద్యమాలు చేపట్టడం పార్టీ శ్రేణులకు అలవాటేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం తణుకులో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు నివాసానికి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో సంస్థాగతంగా పార్టీని పునఃనిర్మాణం చేయడానికి అహర్నిశలూ శ్రమిస్తామన్నారు. తనకు అప్పగించిన బాధ్యతగా సంపూర్ణంగా నిర్వర్తిస్తానని, ప్రజల పక్షాన ఎన్నో పోరాటాలు చేసి ఈ స్థాయికి వచ్చిన అనుభవం పార్టీ శ్రేణులకు ఉందన్నారు. జిల్లాలో పార్టీ కమిటీలు ఏర్పాటుచేసి గ్రామస్థాయి నుంచి కమిటీలను బలోపేతం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పార్టీ కేడర్‌లో ఉన్న కొంత అసంతృప్తిని అర్థం చేసుకున్నామని రాబోయే రోజుల్లో వారికి అండగా నిలిచి సమావేశాల ద్వారా బలోపేతానికి ప్రణాళికాబద్ధంగా నడుస్తామన్నారు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ నిత్యం పార్టీ నేతలతో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బంది ఎదురైనా వారికి అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉంటున్నారని స్పష్టం చేశారు. మాజీ కౌన్సిలర్ యిండుగపల్లి బలరామకృష్ణ, తణుకు పట్టణ, అత్తిలి, ఇరగవరం మండలాల అధ్యక్షులు మంగెన సూర్య, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు పంపన అంజిబాబు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఆకుల పండుస్వామి, గుబ్బల దుర్గాప్రసాద్, మెహర్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్స్ శాఖలో బది'లీలలు'

- అడ్డగోలుగా బదిలీల ప్రక్రియ
- మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులకు ప్రాధాన్యం
- అత్యధికంగా గాంధీనగర్ ఎస్ఆర్‌ఓకు రూ.కోటి
- పటమటకు రూ.50 లక్షలు పలికిన ధర
- సొమ్ములిచ్చిన వారికి అందలం



ఏలూరులో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వం సాధారణ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖలో బదిలీల ప్రక్రియ చేపట్టారు. అయితే నిబంధనలు పాటించకుండా అధికారులు అడ్డగోలుగా బదిలీలు చేపట్టారని ఆ శాఖలో కొందరు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీల్లో మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులకు అధికారులు ప్రాధాన్యత ఇచ్చారని, దీంతో అర్హులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బదిలీల జీఓ రాకముందే కొందరు ఆశావహులు ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల కోసం అర్రులు చాచారు. దీంతో కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలు ఆశావహులను నుంచి భారీ మొత్తంలోనే వసూలు చేసి వారికి సిఫార్సు లేఖలు ఇచ్చినట్టుగా ప్రచారం జరుగుతోంది. కాగా మరికొందరు ప్రజాప్రతినిధులు తమ సామాజికవర్గానికి చెందిన వారికి సిఫార్సు లేఖలు అందించారు.

రూ.లక్షల్లో వసూలు

ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు ఉన్నా ఆ శాఖ ఉన్నతాధికారులు చేతివాటం ప్రదర్శించారు. నిబంధనల మేరకు ఆయా కార్యాలయాల్లో వారిని నియమించడానికి అవకాశం లేదని పేర్కొంటూ వసూళ్లకు తెరదీశారు. సిఫార్సు లేఖలు సమర్పించిన వారికి మాత్రం ముడుపుల్లో రాయితీలు ఇచ్చినట్టు తెలిసింది. అయితే లేఖలు లేనివారి నుంచి మాత్రం పూర్తి మొత్తంలో చెల్లించడానికి ముందుకు వచ్చిన వారికే కోరుకున్న స్థానాలను కేటాయించినట్టు చర్చ జరుగుతోంది. మిగిలిన వారికి అర్హత ఉన్నా వారికి కావాల్సిన స్థానాలు దక్కలేదని అంటున్నారు.

అత్యధికంగా గాంధీనగర్ ఎస్ఆర్‌ఓకు..

ఏలూరు డీఐజీ కార్యాలయంలో జోన్-2 పరిధిలోని ఉమ్మడి కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లకు బదిలీల కౌన్సెలింగ్‌ను ఏలూరు రేంజ్ డీఐజీ ఎస్.మాధవి, కాకినాడ రేంజ్ డీఐజీ బి.శివరామ్, విజయవాడ రేంజ్ డీఐజీ ఎ.రవీంద్రనాథ్ ఆదివారం నుంచి నిర్వహిస్తున్నారు. బదిలీల్లో అత్యధికంగా విజయవాడ గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రూ.కోటి ధర పలికినట్టు ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. దీంతో పాటు విజయవాడలోని పటమట కార్యాలయానికి రూ.50 లక్షలు ధర పలికిందట. పెద్దగా ఆదాయం లేని కార్యాలయాలకు కూడా కనీసం రూ.5 లక్షలు సమర్పిస్తేనే బదిలీలు చేసినట్టు తెలుస్తోంది. సొమ్ములు సమర్పించ లేని వారికి ప్రాధాన్యత లేని పోస్టులను కేటాయించారని చర్చ జోరుగా సాగుతోంది.

అర్హులకు అన్యాయం



పసుపులేటి సత్య వరలక్ష్మి

బదిలీల ప్రక్రియలో అర్హులకు అన్యాయం జరిగిందని రామచంద్రపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పసుపులేటి సత్యవరలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ డీఐజీ కార్యాలయం వద్ద ఆమె విలేకరులతో మాట్లాడారు. తనను డీఐజీ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి రూ.5 లక్షలు డిమాండ్ చేశాడని, తాను సొమ్ములు ఇవ్వడానికి నిరాకరించడంతో బదిలీల జాబితాలో చివరి స్థానంలో పెట్టారన్నారు. ఏసీబీ కేసులు ఉన్నవారిని, వివిధ అంశాల్లో సస్పెన్షన్‌కు గురైన వారిని తన కంటే ముందు వరుసలో పెట్టడంతో తనకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసులు, సస్పెన్షన్లు ఉన్నవారిని 'సి' స్టేషన్లకు బదిలీ చేయాల్సి ఉండగా సొమ్ములు తీసుకుని 'ఎ' స్టేషన్లకు కేటాయించారన్నారు. తనను మాత్రం కోనసీమ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లమన్నారని, ఇది అన్యాయమన్నారు. అలాగే మెటర్నిటీ లీవులో ఉన్న వారికి సెలవు నుంచి తిరిగి వచ్చిన తర్వాతే పోస్టింగ్ ఇవ్వాలని అయితే ఈ బదిలీల్లో ఒక మెటర్నిటీ లీవులో ఉన్న ఉద్యోగినిని కూడా బదిలీ చేశారని ఆరోపించారు. సొమ్ములు ఇచ్చిన వారికి, మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులు, సామాజిక వర్గాలను పరిగణనలోకి తీసుకుని బదిలీలు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం జరిగే వరకూ పోరాడతానని, న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తానని ఆమె స్పష్టం చేశారు. తనతో పాటు మరికొందరికి ఈ బదిలీల్లో అన్యాయం జరిగిందని, అయితే వారిని ఉన్నతాధికారులు బెదిరించారన్నారు.

రవాణా శాఖలో బదిలీలు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా రవాణా శాఖలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. తణుకు వాహన తనిఖీ అధికారి జి.సంజీవకుమార్ పదోన్నతిపై పల్నాడు జిల్లా రవాణా అధికారిగా బదిలీ అయ్యారు. భీమవరం కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) జీవీవీ సత్యనారాయణ విజయవాడ ఉప రవాణా కమిషనర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కేఆర్‌కే వర్మ సీనియర్ అసిస్టెంట్ తాడేపల్లిగూడెం నుంచి కొవ్వూరు యూనిట్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. విజయవాడలో అసిస్టెంట్ మోటార్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎ.సత్యఫణితేజ భీమవరానికి బదిలీ అయ్యారు. విజయవాడలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీకాంత్ భీమవరం జిల్లా రవాణా అధికారి కార్యాలయానికి బదిలీ అయ్యారు. కె.నాగమురళి సీనియర్ అసిస్టెంట్ విజయవాడ నుంచి తాడేపల్లిగూడెం కార్యాలయానికి బదిలీ అయ్యారు.

క్లుప్తంగా

ఇసుక లారీలు సీజ్



మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన లారీలు

మొగల్తూరు : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసినట్లు ఎస్సై జి.వాసు సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం మొగల్తూరు మండలం కెపి పాలెం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఆదివారం రాత్రి తమకు సమాచారం వచ్చిందన్నారు. నిఘా వేసి వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమతి లేకుండా తరలిసున్న రెండు ట్రాక్టర్లను గుర్తించి సీజ్ చేసి తహసీల్దార్ సమాచారం అందించామన్నారు.

అఘాయిత్యాల నివారణకు చర్యలు చేపట్టాలి



నిట్‌లో మాట్లాడుతున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి

తాడేపల్లిగూడెం: మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాల నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి సాయని కోరారు. సోమవారం నిట్, శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. నిట్‌లో స్పందన ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. మహిళలపై అఘాయిత్యాల కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయని, సత్వర చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందన్నారు. మహిళలు పని ప్రదేశాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మహిళల భద్రత అంశంపై మాట్లాడారు. ప్రతి సంస్థలో మహిళల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు. రాత్రి సమయాల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించి అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను విచారిస్తుంటే ఇలాంటి అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ షార్ట్ ఫిలింలు, ప్రకటనల ద్వారా అవగాహన కార్యక్రమాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్పందన పౌండేషన్ అధ్యక్షురాలు భోగిరెడ్డి ఆదిలక్ష్మి, నిట్ రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

చింతలపూడి: చింతలపూడి మండలం తీగలవంచ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. యర్రగుంటపల్లికి చెందిన ఈది కాంతారావు(45) సోమవారం పామాయిల్ గెలలు కోయడానికి వెళ్ళి విద్యుత్ షాక్‌తో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తుల మనోభావాలతో ఆటలా?

- పాలనలో విఫలం.. గోవిందుడిని అడ్డం పెట్టుకుని పాలిటిక్స్
- ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలోనూ సంప్రోక్షణలు
- ఏం జరిగిందోనని భక్తుల్లో ఆందోళన



శ్రీవారి ఆలయంలో హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: భక్తుల మనోభావాలతో సీఎం చంద్రబాబు ఆటలాడుతున్నారు. గోవిందుడిని అడ్డంపెట్టుకుని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. తిరుమల తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిన నెయ్యిని వినియోగించి అపచారానికి పాల్పడ్డారంటూ అసత్య ప్రచారానికి తెరదీయడంతో తాజాగా ఈ ప్రచారాన్ని అన్ని ప్రముఖ దేవాలయాలకు విస్తరింపజేయాలని నిర్ణయించారు. ప్రముఖ ఆలయాల్లోను ఏదో అపచారం జరిగిందనే అపోహ కలిగించడం కోసం దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రముఖ దేవాలయాల్లో సోమవారం సంప్రోక్షణలు జరపడంతో పాటు, స్థానిక ఎమ్మెల్యేలు అందులో పాల్గొనేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఉదయం అర్చకులు లఘు సంప్రోక్షణ మహాశాంతి హోమం నిర్వహించారు. అందులో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు. సంప్రోక్షణల అనంతరం వారంతా కొండపైన అంబరుఖానా (ప్రసాదాల తయారీ కేంద్రం)కు వెళ్లి కాసేపు హడావుడి చేశారు.

భక్తుల్లో ఆందోళన

ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయంలో లఘు సంప్రోక్షణ మహాశాంతి హోమం చేయడం భక్తుల్లో ఆందోళన కలిగించింది. ఇక్కడ అపచారం ఏమైనా జరిగిందా అన్న సందేహాలు కలిగాయి. అయితే తిరుమల తిరుపతిలో జరిగిన వివాదాన్ని పురస్కరించుకుని ఇక్కడ సంప్రోక్షణలు చేస్తున్నట్టు తెలుసుకుని స్థిమిత పడ్డారు. తిరుమల తిరుపతిలో వివాదం రాజుకుంటే ఇక్కడ సంప్రోక్షణలు చేయడం ఏంటని? పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు. నిజంగా తిరుమలలో అపచారం జరిగి ఉంటే విచారణ జరిపి, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, ఇలా అన్ని ఆలయాల్లో సంప్రోక్షణలు చేసి విస్తృత ప్రచారం జరపడం ఏంటని అంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే, టీడీపీ నేతలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన తీరును చూస్తుంటే ఇది కేవలం డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనని స్పష్టంగా తెలుస్తోంది.

హోమాలకు అదే నెయ్యి వాడకం..

సంప్రోక్షణాది కార్యక్రమాల్లో భాగంగా అర్చకులు ఆలయ యాగశాలలో హోమాది కార్యక్రమాలను నిర్వహించారు. అందులో స్వామివారి ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యినే వాడారు. నెయ్యి అపవిత్రం అయ్యిందంటూ జరుపుతున్న కార్యక్రమాల్లో.. హోమాలకు అదే నెయ్యిని వినియోగించడం హాస్యాస్పదంగా ఉంది. చంద్రబాబు హిందూ మతంపై మచ్చ వేసి, భక్తుల మనోభావాలను కించపరుస్తున్నారని పలువురు ధ్వజమెత్తుతున్నారు.

అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే..

బాబు అసమర్థ పాలనను ఎప్పటికప్పుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎండగడుతున్నారు. ప్రస్తుతం వందరోజుల అస్తవ్యస్త పాలనను నిలదీస్తున్న తరుణంలో బాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదంపై విషం కక్కుతున్నారని పలువురు అంటున్నారు. యానిమల్ ఫ్యాట్‌తో లడ్డూ ప్రసాదాల తయారీ జరిగి ఉంటే దానిపై చర్యలు చేపట్టకుండా, ప్రచారానికి ఎందుకు పెద్దపీట వేస్తున్నారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. కావాల్సిన కంపెనీలకు నెయ్యి సప్లై కాంట్రాక్టులను కట్టబెట్టేందుకు ఇలా చేసినా ఆశ్చర్య పడనవసరం లేదని పలువురు అంటున్నారు.

దేవుడితో ఆటలు మంచిది కాదు



తిరుమల తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ప్రచారం చేయడం బాధాకరం. ఆ మాటలు భక్తుల మనోభావాలను దెబ్బతీశాయి. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో సంప్రోక్షణలు ఎందుకు చేశారో ముందు అర్థం కాలేదు. తిరుమలలో అపచారం జరిగిందని ఇక్కడ సంప్రోక్షణలు చేసినట్టు తెలిసి ఆశ్చర్యం కలిగింది. అక్కడ అపచారం జరిగితే.. ఇక్కడ సంప్రోక్షణలు చేయడం ఏంటో.. ఎవరైనా సరే దేవుడితో ఆటలాడటం మంచిది కాదు.

– వెంగల అప్పల నరసమ్మ – భక్తురాలు, ఏలూరు

ప్రచారం కోసమే చేస్తున్నట్టుంది



తిరుమలలో నిజంగా అపచారం జరిగి ఉంటే ముందు పూర్తి స్థాయి విచారణ జరిపి, నిజ నిర్ధారణ తరువాత చర్యలు తీసుకోవాలి. అప్పుడు విషయాన్ని బయటపెట్టాలి. అంతేగాని ముందే ప్రచారం చేయడం ఏమిటి. ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో సంప్రోక్షణలు నిర్వహించడం ఏంటి. ఇదంతా చూస్తుంటే ప్రచార ఆర్భాటమే తప్ప నిజం లేదనిపిస్తోంది. ఇప్పటికైన భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఈ ప్రచారాన్ని ఆపి, పూర్తి స్థాయి విచారణ జరపాలి.

– రాయవరపు మాధవ్ – భక్తుడు, రాజమండ్రి

విర్డ్ ఆస్పత్రి సేవలు అభినందనీయం



విర్డ్ ఆస్పత్రిలో రోగికి కృత్రిమ అవయవాన్ని అందిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

ద్వారకాతిరుమల : పోలియో వ్యాధిగ్రస్తులు, ప్రమాదవశాత్తు అంగవైకల్యం కలిగిన వారికి విర్డ్ ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు అభినందనీయమని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక విర్డ్ ఆస్పత్రిని సోమవారం ఐజీ అశోక్‌కుమార్, డీఎస్పీ డి.శ్రావణ కుమార్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా పుట్టుకతో వచ్చిన అంగవైకల్యంతో బాధపడుతున్న 10 మందికి ఉచితంగా కాలిపర్స్‌ను, అలాగే ప్రమాదాల్లో గాయపడి అవయవాలు కోల్పోయిన 8 మందికి కృత్రిమ అవయవాలను అందజేశారు. ఐజీ విర్డ్ సేవలను కొనియాడారు.

బాలచందర్‌కు జాషువా అవార్డు



పెనుగొండ : రాజమహేంద్రవరం కళాగౌతమి తెలుగు సారస్వత పరిషత్ సంస్థ గుర్రం జాషువా జయంతి సందర్భంగా జాషువా అవార్డుకు పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ బాలచందర్ సాదేను ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం డాక్టర్ బాలచందర్ పెనుగొండలో వివరాలు అందించారు.

రోడ్డెక్కిన కూటమి నేతల విభేదాలు

- కలిదిండిలో రసాభాసగా 'ఇది మంచి ప్రభుత్వం'
- టీడీపీ, జనసేన నేతలతో బీజేపీ నేతల గొడవ



కలిదిండిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో గొడవ పడుతున్న జనసేన, బీజేపీ నాయకులు

కైకలూరు : కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన సందర్భంగా గ్రామాల్లో చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం' కూటమి పార్టీల మధ్య చిచ్చు పెడుతోంది. బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో విభేదాలు మరింతగా పెరుగుతున్నాయి. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కలిదిండి పంచాయతీ రెండో వార్డులో రెండు రోజులుగా టీడీపీ కార్యకర్తలు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటిస్తున్నారు. సోమవారం బీజేపీ నాయకులు అదే వార్డులో విడిగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సచివాలయ సిబ్బంది బీజేపీ నేతలతోనే ఉన్నారు. విషయం తెలుసుకుని టీడీపీ, జనసేన నేతలు తమకు కూడా సచివాలయ సిబ్బందిని ఇవ్వాలని, లేదా అందరం కలసి తిరుగుదామని బీజేపీ నేతలకు చెప్పారు. దీంతో 'ఇది నా ఏరియా.. నాకు చెప్పకుండా మీరు ఎలా కార్యక్రమం చేస్తారు..' అంటూ బీజేపీ నేత పేటేటి సత్యనారాయణ ప్రశ్నించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ విజయానికి వార్డులో అందరూ కష్టపడ్డారని, అందరితో కలసి ప్రచారం చేస్తే తప్పేంటని జనసేన నేత సురేష్ ప్రశ్నించగా, వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. చివరికి ఈ గొడవను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ వద్దే తేల్చుకుందామంటూ కార్యక్రమాన్ని రద్దు చేసుకుని వెళ్లిపోయారు. కూటమి నేతలు నడిరోడ్డుపై దాదాపు 2 గంటల పైన గొడవ పడుతుంటే గ్రామస్తులు వారిని చూసి నవ్వుకోవడం గమనార్హం.

కూటమి నేతల మధ్య విభేదాలు

కైకలూరు నియోజకవర్గంలో కూటమి నేతల మధ్య విభేదాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. భుజబలపట్నం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఒకరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌ను సాధారణ ప్రజలు కలవడానికి కొంతమంది అడ్డుపడుతున్నారని తీవ్రంగా విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. కొద్ది రోజుల క్రితం జనసేన వీర మహిళ కైకలూరులో యువ దంపతులు వడ్డీ డబ్బులు ఇవ్వాలంటూ పోలీసు స్టేషన్‌కు పిలిపించి నానా యాగీ చేసింది. ఈ ఘటనపై డీజీపీకి ఫిర్యాదు చేయడానికి ఆ దంపతులు సిద్ధమవుతున్నారు.

దేవదాయ శాఖలో ఈఓల బదిలీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : దేవదాయ శాఖ కాకినాడ జోన్ పరిధిలో పనిచేస్తున్న పలువురు గ్రేడ్- 1, 2 , 3 ఈఓలను బదిలీ చేస్తూ ఆ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రేడ్-1లో..

పశ్చిమగోదావరి జిల్లాలోని శ్రీ బండి ముత్యాలమ్మ దేవస్థానం ఈఓ వీ.రామకృష్ణంరాజును గునుపూడి సోమేశ్వర జనార్ధన స్వామి దేవస్థానానికి బదిలీ చేశారు. ఏలూరు గ్రూపు ఆలయాల ఈఓ ఎం.రామాంజనేయులను నిడమర్రు గ్రూపునకు, గణపవరం గ్రూపు ఆలయాల ఈఓ వై.శ్రీధర్‌ను ఆరుళ్ళ గ్రూపు ఆలయాలకు, పెంటపాడు శ్రీ గోపాల, ఆంజనేయస్వామి ఆలయ ఈఓ సీహెచ్ సాయిని ఆగిరిపల్లి గ్రూపుకు, రేలంగి గ్రూపు ఆలయాల ఈఓ ఎల్ఎల్ శ్రీనివాసరావును బల్లిపాడు శ్రీ మదనగోపాలస్వామి దేవస్థానానికి , మద్ది ఆంజనేయస్వామి ఆలయాల ఈఓ ఏ.కొండలరావును గుడ్లవల్లేరు శ్రీ కొండాలమ్మ అమ్మవారి ఆలయానికి బదిలీ చేశారు. అప్పనవీడు ఆలయాల ఈఓ కే శ్రీనివాస్‌ను కొల్లేటికోట గ్రూపు ఆలయాలకు, కాళ్ళకూరు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ ఎం.అరుణకుమార్‌ను మొగల్తూరు శ్రీ బండి ముత్యాలమ్మ దేవస్థానానికి, గునుపూడి శ్రీ సోమేశ్వరస్వామి ఆలయ ఈఓ సీహెచ్ సురేష్ నాయుడును పట్టిసం గ్రూపు ఆలయాలకు బదిలీ చేశారు. బల్లిపాడు మదనగోపాలస్వామి ఆలయ ఈఓ జీ.హరిగోపినాథ్‌ను శ్రీ సత్తెమ్మ అమ్మవారు దేవస్థానం అంబరుపేటకు, తంగెళ్లమూడి గ్రూపు ఆలయాల ఈఓ ఎం.వెంకట్రావును ఏలూరు పత్తేబాద శ్రీచౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి బదిలీ చేశారు. నందిగామ, అంబరుపేట శ్రీ సత్యమ్మ అమ్మవారి దేవస్థానం ఈఓ వీ.సీతారామయ్యను నూజివీడు గ్రూపు-2ఆలయాలకు బదిలీ చేశారు.

గ్రేడ్-2 విభాగంలో..

కాళ్ల గ్రూపు ఆలయాల ఈఓ కే.శ్రీనివాసరాజును కోటలపర్రు గ్రూపు ఆలయాలకు, భీమవరం శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ ఈఓ డీవీ కృష్ణంరాజును పండితవల్లూరు గ్రూపు ఆలయాలకు పాలకొల్లు శ్రీ క్షీరరామలింగేశ్వరస్వామి ఆలయ ఈఓ వై.సూర్యనారాయణను దిగమర్రు గ్రూపు ఆలయాలకు, పండితవల్లూరు గ్రూపుల ఆలయాల ఈఓ కేవీవీ బ్రహ్మారెడ్డిని భీమవరం శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి, ఏలూరులోని పత్తేబాద శ్రీ చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి ఆలయ ఈఓ వీ.శంకరరావును రాట్నాలకుంట గ్రూపు ఆలయాలకు, ఏలూరు గ్రూపు-5 ఆలయాల ఈఓ ఎన్.రవిశంకర్‌ను రాచూరు గ్రూపు ఆలయాలకు బదిలీ చేశారు. యనమదుర్రు శ్రీ శక్తీశ్వర స్వామి ఆలయ ఈఓ కర్రి శ్రీనివాసరావును కొణితివాడ శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి, తాడేపల్లిగూడెం ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ఈఓ పీ.హరేరామప్రసాద్‌ను దువ్వ గ్రూపు ఆలయాలకు, మత్స్యపురి గ్రూపు ఆలయాల ఈఓ టీ.శ్రీనివాసరావును భీమవరం శ్రీ భీమేశ్వరస్వామి ఆలయానికి, రాట్నాలకుంట గ్రూపు ఆలయాల ఈఓ ఎన్. సతీష్‌కుమార్‌ణు ఏలూరు ఆర్ఆర్‌పేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి బదిలీ చేశారు. నిడమర్రు గ్రూపు ఆలయాల ఈఓ ఎస్.శోభానాద్రిని గణపవరం గ్రూపు ఆలయాలకు, పెదనింద్రకొలను గ్రూపు ఆలయాల ఈఓ బీవీ చంద్రశేఖర్‌ను పెంటపాడు శ్రీ బైగారి మఠానికి, కడలి గ్రూపు ఆలయాల ఈఓ ఎం.సత్యనారాయణను భీమవరం డీజీఆర్ సత్రానికి, వేలివెన్ను గ్రూపు ఆలయాల ఈఓ పీవీ సుబ్రహ్మణ్యంను ఇరగవరం శ్రీ కేశవస్వామి, శ్రీ కైలేశ్వరస్వామి ఆలయానికి, గుడివాడ శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ ఈఓ ముచ్చెర్ల శ్రీనివాసరావును పాలకొల్లు శ్రీ క్షీరరామలింగేశ్వరస్వామి ఆలయాలకు బదిలీ చేశారు. అమలాపురం శ్రీ చెన్నమల్లేశ్వరస్వామి ఆలయాల ఈఓ కే.జానకిరామరాజును తణుకు గ్రూపు ఆలయాలకు, రాజమహేంద్రవరం గ్రూపు-6 ఆలయాల ఈఓ జీ.పవన్‌కుమార్‌ను ఏలూరు వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి, కొవ్వూరు గ్రూపు-1 ఆలయాల ఈఓ వీ.ఆంజనేయరాజును కాళ్ల గ్రూపు-1 ఆలయాలకు, మండపాక గ్రూపు ఆలయాల ఈఓ పీ.సూర్యనారాయణను పెనుమదం గ్రూపు ఆలయాలకు బదిలీ చేశారు.

గ్రేడ్-3 విభాగంలో..

వల్లూరు గ్రూపు ఆలయాల ఈఓ ఆర్‌వీవీఎస్ రామచంద్రకుమార్‌ను నర్సాపురం శ్రీ అమరేశ్వర గ్రూపు ఆలయాలకు, గుంపర్రు గ్రూపు ఆలయాల ఈఓ జీ.లోకేశ్వరరావును వల్లూరు గ్రూపు ఆలయాలకు, పాలకొల్లు శ్రీ సలాదివారి సత్రం ఈఓ ఎన్.రంగరాజన్‌ను పాలకొల్లు శ్రీ క్షీరపుర అన్నదాన సమాజానికి, పాలకొల్లు శ్రీ క్షీరపుర అన్నదాన సమాజం ఈఓ ఏవీ సత్యనారాయణను పెదమల్లం గ్రూపు ఆలయాలకు, వేడంగి శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ ఈఓ వీ.నాగజ్యోతిని పాలకొల్లు సలాదివారి సత్రానికి, దొడ్డిపట్ల గ్రూపు ఆలయాల ఈఓ ఎం.రఘునాథ్‌ను మత్స్యపురి గ్రూపు ఆలయాలకు, వీరవాసరం గ్రూపు ఆలయాల ఈఓ కే.రామచంద్రరావును నర్సాపురం గ్రూపు ఆలయాలకు బదిలీ చేశారు. ఏలూరు జిల్లాలోని గ్రేడ్-3 ఈఓల్లో కలిదిండి, తాడినాడ గ్రూపు ఆలయాల ఈఓ ఎస్.శ్రీనివాస్‌ను వడలి గ్రూపునకు, ఏలూరు ఆర్ఆర్‌పేట గ్రూపు ఆలయాల ఈఓ పీ.రీనామాధురిని ఏలూరు పడమరవీధి వెంకటేశ్వరస్వామి ఆలయానికి, ఏలూరు రంగ్రీజుమఠం ఆలయాల ఈఓ సీహెచ్ చిననాగేశ్వరరావును కైకలూరు ఆలయాలకు, గుండుగొలను ఆలయాల ఈఓ కే.మోహనవంశీనికి మద్దూరు గ్రూపు ఆలయాలకు, మండవల్లి గ్రూపు ఆలయాల ఈఓ దివ్యశ్రీని సీసలి గ్రూపు ఆలయాలకు, ఏలూరు శ్రీ అన్న వస్త్ర వైద్య విద్య దాన సమాజం ఈఓ పీవీ కృష్ణంరాజును ఏలూరు గ్రూపు-3 ఆలయాలకు, ముదినేపల్లి గ్రూపు ఆలయాల ఈఓ పీ.ఏసునాయుడును తోలేరు గ్రూపు ఆలయాలకు, భీమడోలు గ్రూపు ఆలయాల ఈఓ ఎస్.నెహ్రూబాబును ఏలూరు చుండూరువారి సత్రం తదితర సత్రాలకు, నూజివీడు గ్రూపు-2 ఆలయాల ఈఓ బీ.శ్రీనివాసరెడ్డిని మొగల్తూరు గ్రూపు ఆలయాలకు క్రొవ్విడి గ్రూపు ఆలయాల ఈఓ కే.సూర్యనారాయణను రేలంగి గ్రూపు ఆలయాలకు బదిలీ చేశారు.

అంతర్ జిల్లా బైక్ దొంగల అరెస్టు



రికవరీ చేసిన బైక్‌లను పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్ : అంతర్ జిల్లాల బైక్ దొంగలను దెందులూరు, గణపవరం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. రెండు పోలీస్‌స్టేషన్ల పరిధిలో సుమారు రూ.45 లక్షల విలువైన 60 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏలూరు నగరానికి చెందిన పులిగడ్డ జగదీష్‌బాబు జల్సాలకు అలవాటుపడి డబ్బులు సులువుగా సంపాదించాలనే కాంక్షతో ఒక ముఠాను తయారు చేశాడు. బైక్ మెకానిక్ ఆగడం సూర్యప్రకాష్‌తో కలిసి వంజరపు శ్రీనివాస్, బొడ్డు లక్ష్మణ్‌కుమార్, పఠాన్ నాగూర్ మీరా, చీకట్ల సతీష్‌తో ఒక ముఠాగా ఏర్పడ్డారు. బైక్‌లు చోరీ చేయడం ప్రారంభించారు. ఈ ముఠా నుంచి 31 బైక్‌లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పెదవేగి సీఐ కే.వెంకటేశ్వరరావు, దెందులూరు ఎస్ఐ కే.స్వామి ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించారు. గణపవరం మండలం ముగ్గళ్ళకు చెందిన శెట్టి చిన్నా బైక్‌ల చోరీ అలవాటుగా చేసుకున్నాడు. శెట్టి చిన్నాతో పాటు కొయ్యలగూడెం మండలం చొప్పరామన్నగూడెంకు చెందిన చప్పిడి ముసలయ్య అలియాస్ కేసీఆర్‌తో కలిసి బైక్‌లు చోరీ చేస్తున్నాడు. నిడమర్రు సీఐ ఎం.సుభాష్ ఆధ్వర్యంలో ఎస్ఐ మణికుమార్, సిబ్బంది దొంగలను పట్టుకున్నారు. చిన్నాను అరెస్ట్ చేయగా, మరొకరు పరారీలో ఉన్నాడు. వీరి నుంచి 29 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

అశోక్ శ్రీనివాస్‌కు నివాళి



అశోక్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్.విజయమ్మ



సంతాపం తెలియజేస్తున్న కోటగిరి శ్రీధర్, కారుమూరి సునీల్ కుమార్, దూలం నాగేశ్వరరావు, కంభం విజయరాజు, జయ ప్రకాష్

కామవరపుకోట: ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నేత మేడవరపు అశోక్ శ్రీనివాస్‌కు పలువురు రాజకీయ నాయకులు సోమవారం నివాళులర్పించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాతృమూర్తి వైఎస్ విజయమ్మ, ఉండవల్లి అరుణ్ కుమార్, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎన్. రఘువీరారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరు సునీల్ కుమార్, చింతలపూడి సమన్వయకర్త కంభం విజయ రాజు, మాజీ ఎమ్మెల్యే మేక వెంకట ప్రతాప్, ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గోరుముచ్చు గోపాల్, పార్టీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నౌడు వెంకట్రావు, ఏలూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ జయప్రకాష్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బీవీఎస్ రెడ్డి, జెట్టి గురునాథరావు తదితరులు నివాళులర్పించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

దెందులూరు: గోదావరి కాల్వలో శింగవరం సమీపంలో సోమవారం గుర్రపుడెక్క మధ్య గుర్తు తెలియని మృతదేహం లభించిందని దెందులూరు ఎస్సై కే.స్వామి అన్నారు. సీతంపేట వీఆర్‌ఓ రామచంద్రరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడి వయసు 45 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు.

పొగాకు సాగుకు సన్నద్ధం

- ముమ్మరంగా నారుమడులు కడుతున్న రైతులు
- అధిక దిగుబడులనిచ్చే వంగడాల సాగుకు శ్రీకారం
- గిరిజన ప్రాంతంలో భారీగా పెరిగిన కౌలు ధర



బుట్టాయగూడెం మండలం ముప్పినవారిగూడెంలో రైతులు పెంచుతున్న నారుమడులు

బుట్టాయగూడెం: జిల్లాలోని ఏజెన్సీ, మెట్ట ప్రాంతంలో పొగాకు సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఒక పక్క పొగాకు బేళ్ల అమ్మకాలు జరుగుతుండగా మరో పక్క ముమ్మరంగా రైతులు పొగాకు నారుమడులు కడుతున్నారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి పొగాకు సాగు సీజన్ ప్రారంభమైంది. ఈ ఏడాది పండించే పొగాకు పంట ఉత్పత్తికి సంబంధించి పొగాకు బోర్డు కోటాను ఖరారు చేయడంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అత్యధికంగా ఐటీసీ సంస్థ సరఫరా చేస్తున్న ఎల్‌వీ7, 1350, 1353, 1383 వంగడాలతో ఎక్కువగా నారుమడులు వేస్తున్నారు. ఈ వంగడాలు ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్ల వరకూ దిగుబడి ఇచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. నారుమడులు కట్టడానికి వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు దుక్కులు కూడా సిద్ధం చేసుకుంటున్నారు. జంగారెడ్డిగూడెం వేలం కేంద్రాలు-1, 2, కొయ్యలగూడెం, దేవరపల్లి, గోపాలపురం వేలం కేంద్రాల పరిధిలో సుమారు 72 వేల మంది రైతులు పొగాకు పండిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గత రెండేళ్లుగా వర్జీనియా పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు పొగాకు సాగుకు సిద్ధమవుతున్నారు.

ట్రే నర్సరీల వైపు రైతుల చూపు

ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో ఎక్కువగా రైతులు ట్రే నర్సరీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. పొలాల్లో షెడ్‌లు వేసి నారుమడులు పెంచుతున్నారు. ట్రేలలో పెంచిన నారు నాణ్యంగా ఉండడంతో పాటు చీడపీడలను తట్టుకుంటుందని రైతులు తెలిపారు. ఒక ట్రేలో 70 మొక్కలు ఉంటాయని ఒక్కో మొక్క రూపాయి నుంచి రెండు రూపాయల వరకూ ధర ఉంటుందని రైతులు చెప్పారు. గత ఏడాది డిసెంబర్‌లో మిచాంగ్ తుపాను కారణంగా పొగాకు పంట దెబ్బతినడంతో ఆ సమయంలో పొగాకు నారు కొరత ఏర్పడింది. దీనితో నారు ధర పలికింది. మొక్క ధర సుమారు రూ.5 వరకు రైతులు కొనుగోలు చేశారు. ఈ ఏడాది రైతులు ఎక్కువ మంది ట్రే నర్సరీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. బుట్టాయగూడెం, ముప్పినవారిగూడెం, రెడ్డిగణపవరం, సూరపవారిగూడెం, కొమ్ముగూడెం, అచ్చియ్యపాలెం, జీలుగుమిల్లి, మలగలంపల్లి గ్రామాలతో పాటు కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో కూడా ఎక్కువగా నారుమడులు రైతులు పెంచుతున్నారు.

గిరిజన ప్రాంతంలో భారీగా పెరిగిన కౌలు

గత రెండు సంవత్సరాలుగా వర్జీనియా పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది ఎక్కువ మంది పొగాకు పంట పండించేందుకు మొగ్గు చూపుతున్నారు. రికార్డు స్థాయిలో జంగారెడ్డిగూడెం వేలం కేంద్రంతో పాటు దేవరపల్లి, కొయ్యలగూడెం వేలం కేంద్రాల్లో కూడా పొగాకు కేజీ రూ.410 ధర పలికింది. దీంతో ఎక్కువ మంది కౌలు రైతులు పొగాకు సాగుకు ఆశక్తి చూపుతున్నారు. గిరిజన ప్రాంతంలో భూములకు అమాంతంగా రెక్కలొచ్చాయి. ఏకంగా ఎకరం భూమి కౌలు సుమారు రూ. 80 వేలుకు పెరిగినట్లు రైతులు తెలిపారు.

2 ఎకరాల్లో నారు పెంచుతున్నా



గత ఏడాది తుఫాన్ కారణంగా సుమారు రూ.కోటి పంట నష్టం వచ్చింది. ఆ సమయంలో మళ్లీ పంట వేయడానికి నారు కోసం ఇబ్బందులు పడ్డాను. ఈ ఏడాది రెండు ఎకరాల్లో నేనే పొగాకు నారును ఐటీసీ, సీటీఆర్ఐ అధికారుల సూచన మేరకు పెంచుతున్నాను. 130 ఎకరాల్లో పొగాకు పంట వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాను.

– సయ్యద్ బాజీ, కౌలు రైతు, అచ్చియ్యపాలెం, బుట్టాయగూడెం మండలం

క్లుప్తంగా

ముదునూరిని సత్కరించిన మాజీ మంత్రి కారుమూరి



ముదునూరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ మంత్రి కారుమూరి, పార్టీ శ్రేణులు

తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన ముదునూరి ప్రసాదరాజును మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఘనంగా సత్కరించారు. సోమవారం కారుమూరి నివాసానికి వచ్చిన ఆయనను కారుమూరి పార్టీ శ్రేణులతో కలిసి సత్కరించారు. ప్రసాదరాజుకు నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులను కారుమూరి పరిచయం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యిండుగపల్లి బలరామకృష్ణ, తణుకు పట్టణ, అత్తిలి, ఇరగవరం మండలాల అధ్యక్షులు మంగెన సూర్య, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

గూడెం డీఎస్పీగా విశ్వనాథ్ బాధ్యతల స్వీకరణ



తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం డీఎస్పీగా డి.విశ్వనాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న మూర్తి ఏసీబీ డీఎస్పీగా బదిలీ అయ్యారు. సబ్ డివిజన్‌లోని అధికారులు మర్యాదపూర్వకంగా డీఎస్పీ విశ్వనాథ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గూడెం మునిసిపల్ కమిషనర్‌గా ఏసుబాబు

తాడేపల్లిగూడెం: గూడెం మునిసిపల్ కమిషనర్‌గా ఎం.ఏసుబాబును నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వస్తున్నారు. గూడెం ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణ విశాఖ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. గూడెం మునిసిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు భీమవరం సహాయక కమిషనర్‌గా వెళ్లనున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు వచ్చాయి. రెండు మూడు రోజుల్లో కొత్త కమిషనర్ బాధ్యతలు తీసుకోనున్నారు.

రాష్ట్రపతి రోడ్డులో భారీ అన్నసమారాధన



తణుకు రాష్ట్రపతి రోడ్డులో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

తణుకు అర్బన్: వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దేవదాయ శాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంఏర్పాటుచేసిన కౌంటర్ల ద్వారా 15 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించినట్టు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొమ్మిరెడ్డి సూరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు స్వచ్ఛందంగా హాజరై అన్నప్రసాదం వడ్డించారు.

ఉండి ఎమ్మెల్యేపై చర్యలకు డిమాండ్



అత్తిలిలో తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న దళిత సంఘాల నాయకులు

అత్తిలి: ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు అత్తిలి తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ప్రపంచ అత్యున్నత రాజ్యాంగాన్ని అందించిన రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని దుర్మార్గంగా చించివేసి రాజ్యాంగాన్ని అవమానించిన ఉండి ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇండియా దళిత్ రైట్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బట్టు నాగరాజు, దళిత నాయకులు కొండే శ్రీను, రాపాక నాని, బుడితి సుజన్ కుమార్, కొల్లాపు ఏసు తదితరులు డిమాండ్ చేశారు.

వరద బాధితులకు విరాళం

పాలకొల్లు సెంట్రల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి పశ్చిమగోదావరి జిల్లా భారతీయ విద్యాభవన్స్ సంస్థల నుంచి రూ.15 లక్షలు విరాళం అందజేసినట్లు విద్యా సంస్థల చైర్మన్ సామంతపూడి శ్రీరామరాజు తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయంలో చంద్రబాబునాయుడికి భారతీయ విద్యా భవన్స్ విద్యార్థులచే రిలీఫ్ ఫండ్ చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో భూపతిరాజు అచ్యుతరామరాజు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో విద్యుత్ వాహకాలతో తస్మాత్ జాగ్రత్త

- విద్యుత్ ప్రమాదాల పట్ల వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలి
- అజాగ్రత్తతో అమాయక ప్రాణాలు బలి
- జాగ్రత్తలపై విద్యుత్ శాఖ కరపత్రాల పంపిణీ



తణుకు విద్యుత్ సబ్‌స్టేషన్

తణుకు అర్బన్: అసలే వర్షాకాలం ఆపై ఈదురు గాలులు దీంతో విద్యుత్ వాహకాలపై ప్రజలు, విద్యుత్ వినియోగదారులు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. నిత్యం ఏదో పక్కన విద్యుదాఘాతంతో అమాయక ప్రజానీకం అసువులు బాస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఎన్ని జాగ్రత్తలు సూచించినా ప్రమాదాలు జరుగుతూనేఉన్నాయి. వర్షాలకు పడుతున్న వృక్షాలు, తెగిపడుతున్న విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలకు విద్యుత్ సరఫరాతోపాటు షార్ట్ సర్క్యూట్ వంటి సందర్భాలు ఉంటున్న పరిస్థితుల్లో విద్యుత్ శాఖ అధికార యంత్రాంగం సైతం అప్రమత్తమై వినియోగదారులకు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులకు తెగిపడుతున్న విద్యుత్ తీగలు తగిలి నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్‌శాఖ ప్రజానీకానికి అవగాహన కల్పించేందుకు కరపత్రాల పంపిణీతోపాటు సామాజిక మాధ్యమాలద్వారా జాగ్రత్తలను తెలుపుతుంది.

వర్షాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- భారీ వర్షాల సమయాల్లో ఇంటి గృహోపకరణాల స్విచ్‌లను ఆఫ్ చేసి ఉంచాలి.
- గృహాల్లో కరెంటు స్విచ్ బోర్డుల్లో స్విచ్‌లను తడి చేతులతో తాకరాదు.
- చిన్న పిల్లలను కరెంటు వస్తువులకు దూరంగా ఉంచాలి.



తణుకులో విద్యుత్ స్తంభాలు

- ఇంటి సర్వీసు వైరు తెగినా, జాయింట్స్ కట్ అయినా వాటిని తాకకుండా వెంటనే విద్యుత్ శాఖకు తెలియచేయాలి.
- విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లను తాకరాదు.
- ఇంటి పరిసరాల్లో చెట్లు, కరెంటు స్తంభాలు పడిపోయిన సందర్భాల్లో దగ్గరకు వెళ్లకుండా ముందుగా విద్యుత్ శాఖకు తెలియపరచాలి.



తణుకులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- గృహాల ఆవరణలోని నీళ్ల మోటార్లకు ఉన్న కరెంటు వైర్లను తాకరాదు.
- గాలి, వాన వస్తున్న సమయాల్లో కరెంటు లైన్లు కింద నిలబడడం, కూర్చోవడం చేయరాదు.
- రహదారుల్లో విద్యుత్ ప్రసారం జరిగే తీగలు తెగి పడి ఉంటే విద్యుత్ ప్రవాహం ఉన్నట్లుగా భావించి దూరంగా ఉండాలి.
- మోటార్ల స్టార్టర్లు, మోటార్లు వర్షం వలన నీటిలో మునగడం, పూర్తిగా తడవడం వలన షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉండడంతో రైతులు జాగ్రత్తలు పాటించాలి.
- విద్యుత్ ప్రమాదానికి గురైన వారిని కానీ ఆ విద్యుత్ పరికరాన్ని కానీ నేరుగా తాకరాదు.
- రహదారులపై ఉన్న విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదు.
- ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలపై పోస్టర్‌లు, పెయింటింగ్‌ల కోసం వెళ్లరాదు.
- విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ 1912 నంబరులో సంప్రదించాలి.

విద్యుత్ శాఖ ద్వారా సత్వర సేవలు



విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు విద్యుత్‌శాఖ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుంది. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులతోపాటు విద్యుత్ ప్రమాదాలు సంభవించిన సందర్భాల్లో సైతం విద్యుత్ శాఖ అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సత్వర సేవలందిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు, విద్యుత్ వినియోగదారులు తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. విద్యుత్ సరఫరాతోపాటు విద్యుత్ శాఖకు సంబంధించిన ఏ ఇబ్బంది ఎదురైనా ప్రజలు కార్యాలయానికి నేరుగా వచ్చి తెలపవచ్చు.

– సీహెచ్ రామకృష్ణ, తణుకు విద్యుత్ శాఖ డీఈఈ

నజీరుద్దీన్‌కు నేడు సత్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వర్ధమాన గాయకుడు, ఆహా ఛానల్లో ఇండియన్ ఐడల్ పాటలు పోటీలో ఫేజ్ త్రీలో విన్నర్ తాడేపల్లిగూడెంకు చెందిన నజీరుద్దీన్‌ను ఈ నెల 24న మంగళవారం సాయంత్రం 6 గంటలకు స్థానిక డీఎస్ చెరువు బుద్ధాల కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సన్మాన కమిటీ కోరింది. హోటల్ శ్రీరామ్ సెంటర్ నుంచి ఊరేగింపు నిర్వహిస్తారని చెప్పారు. బీవీఆర్ కళాకేంద్రం, అప్సా, తెలుగు సాహితీ సమాఖ్య, పట్టణ ప్రముఖులు హాజరవుతారని వివరించారు.

24న సామూహికంగా ఎలుకల నిర్మూలన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ఈ నెల 24, 25వ తేదీల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక తన కార్యాలయంలో మాట్లాడారు. 24న ఎలుక బొరియల గుర్తింపు, 25న తెరిచి ఉన్న బొరియల్లో బ్రోమోడయోలిన్ మందును ఉంచుతామ న్నారు. రైతులందరూ ఒకేసారి ఈ కార్యక్రమం చేపట్టడం ద్వారా ప్రయోజనం ఉంటుందన్నారు.

నేడు తణుకులో ఉచిత వైద్య శిబిరం

తణుకు టౌన్: స్థానిక ఎస్ఎంవీఎం హాస్పిటల్ (మెడికల్ ట్రస్ట్)లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. కంటి, సాధారణ సమస్యలతో పాటు ఎమర్జెన్సీ కేసులకు వైద్యం అందిస్తారని పేర్కొన్నారు. వైద్యులు వి.శంకర్‌నాగ్, ఎం రాజగోపాలరావు, కె.రామకృష్ణారెడ్డి, ఎం తేజశ్విని, డి.మహేష్ పాల్గొంటారని తెలిపారు.

దసరా ఉత్సవాలకు అంకురార్పణ





దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం చేస్తున్న ఈవో శ్రీదేవి, గ్రామ పెద్దలు, పూజలందుకుంటున్న దుర్గమ్మ

పెంటపాడు: ప్రసిద్ధి చెందిన ప్రత్తిపాడు వై.జంక్షన్ కనకదుర్గమ్మ ఆలయం దసరా ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాలకు సంబంధించి ఆలయం వద్ద రాట ముహూర్తం (అంకురార్పణ) సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీదేవి సూచనల మేరకు అమ్మవారికి ఆలయం వద్ద అర్చకులు కొత్తలంక శివసత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని పసుపు, కుంకుమలతో ప్రత్యేకంగా పూజలు చేశారు. గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, ఆలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు పని ఒత్తిడి తగ్గించాలని వినతి



డీఎంహెచ్‌వోను కలిసి సమస్యలను వివరిస్తున్న ఏఎన్ఎంలు

పెంటపాడు: వైద్య, ఆరోగ్య సేవలు అందించే ఏఎన్ఎంకు ప్రభుత్వం తక్షణం పని భారాన్ని తగ్గించాలని ఆ సంఘ నాయకులు జయమణి, సుభాషిణి డిమాండ్ చేశారు. పెంటపాడు మండలానికి చెందిన ఏఎన్ఎంలు సోమవారం భీమవరంలోని కార్యాలయంలో డీఎంహెచ్‌వోను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. గ్రామాల్లో 108,104 సేవలతో పాటు, టీకాలు, గర్భిణుల డెలివరీ కేసులు, తల్లీబిడ్డల సేవలతో పాటు, వలంటీర్లు చేసే సేవలు, యాప్‌ల నిర్వహణ, ఇంకా మరెన్నో పనులు చేయాలని మండల అధికారులు చెప్పడంతో తాము పనివేళలకు మించి తీవ్రంగా కష్టించి పనిచేస్తున్నారు. ఈ పని ఒత్తిడిని తక్షణం తగ్గించి తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని అందుకున్న డీఎంహెచ్‌వో ఈ సమస్యలను ఉన్నతాధికారులకు విన్నవిస్తానని తెలిపినట్లు ఏఎన్ఎం సంఘ సభ్యులు పేర్కొన్నారు. పెంటపాడు, ముదునూరు పీహెచ్‌సీలకు చెందిన పలు గ్రామాల ఏఎన్ఎంలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



తణుకులో జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు



తణుకులో క్రీడా పోటీల్లో హైజంప్ చేస్తున్న క్రీడాకారుడు

తణుకు అర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో భాగంగా తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో క్రీడాకారులు తమ సత్తా చాటారు. అథ్లెటిక్స్, చెస్, బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించి తణుకు మునిసిపాలిటీతోపాటు తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో 60 మంది విజేతలుగా నిలిచి జిల్లాస్థాయికి ఎంపికైనట్టు నియోజకవర్గ కోఆర్డినేటర్ సంకు సూర్యనారాయణ తెలిపారు. ఈ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు బి.జాన్సన్, టి.వినోద, వై.సోమయాజులు, ఎం నాగరాజ్యం, కె.సుబ్బారావు, ఎస్ అప్పారావు, జి.రవి, కె.శ్రీనివాస్, జి.తాతారావు, జి.శ్రీతల్లి, కె.సంధ్యారాణి, పి.చిట్టితల్లి, వి.సుమలత తదితరులు పర్యవేక్షించారు.

అమ్మనాంబ ఆశ్రమానికి మహిళల సాయం



ఆశ్రమంలో నిత్యావసర సరుకులు, పండ్లు అందించిన మహిళలు

తణుకు అర్బన్: తణుకు రైల్వే స్టేషన్‌రోడ్డులోని అమ్మనాంబ ఆశ్రమంలో వృద్ధుల సౌకర్యార్థం సోమవారం స్థానిక 12వ వార్డు ఇరగవరం కాలనీలోని కొలగాని కృష్ణవేణి ఆధ్వర్యంలో మహిళలు బియ్యం, నిత్యావసర సరుకులు, పండ్లు, రూ.2 వేలు అందజేశారు. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయ అర్చకుడు సాయి మాట్లాడుతూ 20 మంది వరకు వృద్ధులకు ఆహారంతోపాటు ఉండడానికి నీడనిస్తున్న అంబనాంబ ఆశ్రమానికి దాతలు చేయూత అందించాలని కోరారు. ఆశ్రమ నిర్వాహకురాలు మాతాజీ శాంతమ్మ మాట్లాడుతూ వృద్ధులకు ఎటువంటి లోటులేకుండా చూస్తున్నామని, వృద్ధుల కోసం మహిళలు చూపించిన ఔదార్యం ఎనలేనిదని అన్నారు. మహిళలు వెన్నా రాణి, నమ్మి ధనలక్ష్మి, మతల సంతోషికుమారి, రామదాసు నరసమ్మ, రేగాని చింతాలమ్మ పాల్గొన్నారు.

ఆహారంలో చిరుధాన్యాలు ఉండాలి



అత్తిలి: తిరుపతిపురంలో పోషణ మాసోత్సవ ర్యాలీలో పాల్గొన్న సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి, ప్రజా ప్రతినిధులు



తణుకు టౌన్: ఎర్రనీలిగుంటలో పోషకాహార మాసోత్సవంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

అత్తిలి: గర్భిణులు, బాలింతలు రోజువారీ తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు ఉండేటట్లు చూసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి సూచించారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేసే బాలసంజీవని కిట్‌లు, బాలామృతం, గుడ్లు, పాలు వంటి పౌష్టికాహార పదార్థాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయన్నారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కాండూరి మణికంఠ, స్థానిక నాయకులు బొప్పా చంటి, గంటా వెంకటేశ్వరరావు, సామన సత్తిబాబు, జోగి వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అత్తిలిలో..

బాల్యవివాహాలు వల్ల అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయని ఐసీడీఎస్ అత్తిలి సెక్టార్ సూపర్‌వైజర్ కె.కుమారి అన్నారు. పోషణ మాసోత్సవంలో భాగంగా సోమవారం అత్తిలి మట్టపర్తిగర్వు ప్రాథమిక పాఠశాలలో బాల్యవివాహాల నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ కుమారి మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం వల్ల శారీరక అవయువాలు ఎదుగుదల లేకపోవడం, రక్తహీనత వంటి అనేక అనర్థాలు సంభవిస్తాయని హెచ్చరించారు. ఆడపిల్లకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు నిండకుండా వివాహాలు చేసిన వారిపై చట్ట ప్రకారం శిక్షార్హులని చెప్పారు. కిశోర బాలికలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని టి.సత్యకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త పి.దుర్గాదేవి పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

తణుకు టౌన్: గర్భిణులు, బాలింతలు పోషకాలు ఎక్కువగా ఉండే ఆకు కూరలు, చిరుదాన్యాలను ఆహారంగా తీసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ టి.తులసీదేవి కోరారు. సోమవారం తణుకు రూరల్ మండలం మండపాక శివారు ఎర్రనీలిగుంటలోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార మహోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పోషకాహారం గురించి వివరించారు. వైద్య సిబ్బంది ఎం జయరాజు, వైటీ మూర్తి, సంధ్యారాణి, అంగన్‌వాడీ కార్యకర్త ఝాన్సీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వర్షపు నీటి సంరక్షణపై అవగాహన

ఇరగవరం: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో సోమవారం వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాల తనిఖీపై అవగాహన కల్పించినట్టు ఎంపీడీఓ ఎ.శ్రీనివాస్ తెలిపారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి, గుంటలు తవ్వి నీరు ఇంకిపోయేల చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల నీటి నిల్వలు కాపాడి భవిష్యత్ తరలకు అందిచవచ్చని చెప్పారు. మంచినీటి వనరులను శుభ్రపరుచుట, వాటి నిర్వహణపై శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించినట్టు చెప్పారు. కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లోని పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఇండియన్ ఐడియల్ ఫేజ్ త్రీ పోటీల్లో విన్నర్‌కు అభినందన

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆహా ఛానల్‌లో ఇండియన్ ఐడియల్ ఫేజ్ త్రీ పాటల పోటీల్లో విన్నర్‌గా నిలిచిన తాడేపల్లిగూడెంనకు చెందిన నజీరుద్దీన్‌ను సోమవారం పట్టణంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సత్కరించారు. జ్ఞాపికను బహూకరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఘంటసాల గాన సభ అధ్యక్షుడు, పట్టణ సీనియర్ గాయకుడిగా పేరు పొందిన షేక్ ఖాసిం తన మనుమడు నజీరుద్దీన్‌కు సంగీతం నేర్పించడంతో పాటు గాయకుడిగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తున్న నజీరుద్దీన్ మరింత ఎదగాలని ఆకాంక్షించారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది

యలమంచిలి: మండలంలోని 32 గ్రామాల్లో ఈ నెల 24 నుంచి డిసెంబర్ చివరి వరకు ప్రతీ మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు అధికారులతో కలిసి రైతులకు మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ధ్యేయమన్నారు. మంగళవారం ఉదయం గుంపర్రు, మధ్యాహ్నం దొడ్డిపట్లలో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. మంగళవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. రైతులు పొలం గట్ల వెంబడి తిరిగి ఎలుకల బొరియలు గుర్తించి, ఆ బొరియలను మట్టితో కప్పాలన్నారు. మరుసటి రోజు ఏ బొరియలు తెరచి ఉన్నాయో గుర్తించి వాటి వద్ద ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న బ్రోమడయోలిన్ పొట్లాలను ఉంచాలని ఆమె కోరారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



బ్లాక్ డేలో మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద బ్లాక్ డేను నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ హాజరై మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 4 కోడ్‌లుగా విభజించారని వాపోయారు. కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అప్పజెప్పడం వల్ల కార్మిక వర్గం కట్టు బానిసలాగా మారుతున్నారన్నారు. వ్యవసాయ కార్మికులకు అండగా ఉన్న ఉపాధి హామీ పథకానికి కోత విధించడం వల్ల ఉపాధి కూలీలకు పనులు తగ్గాయని తెలిపారు. కౌలుదారులకు గుర్తింపు కార్డులు లేని కారణంగా, వ్యవసాయ రంగంలో ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు వల్ల వ్యవసాయ రంగానికి వారు దూరం అవుతున్నారని వాపోయారు. రైతాంగా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోకపోతే రానున్న ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి తగు బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. బ్లాక్ డేలో జవ్వాది శ్రీను, సత్తి కోదండ రామిరెడ్డి, చల్లా చంద్రరావు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, రమణ, చిన్నా, శ్రీను, శేషుబాబు, కృష్ణ, దుర్గారావు, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

తణుకులో సీఐటీయూ బ్లాక్ డే



తణుకులో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

తణుకు: కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయకపోతే మోదీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ హెచ్చరించారు. సోమవారం తణుకు నరేంద్ర సెంటర్‌లో కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో బ్లాక్ డే నిర్వహించారు. బ్లాక్ రిబ్బన్లను ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రతాప్ మాట్లాడుతూ 2019 సెప్టెంబర్ 23న పార్లమెంట్‌లో ఎలాంటి చర్చలు లేకుండా ఏకపక్షంగా రైతు, కార్మిక చట్టాలు తీసుకొచ్చారని విమర్శించారు. రైతు, కార్మిక సంఘాలు, నిపుణులతో ఎలాంటి చర్చలు చేయలేదని అన్నారు. మోదీ ప్రభుత్వానికి మెజారిటీ లేకపోయినప్పటికీ గతంలో మాదిరిగానే కార్మిక, రైతు చట్టాలు అమలులో దూకుడుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గార రంగారావు, "దక్షిణామూర్తి, శివకుమార్, అంబటి రామకృష్ణ, సీహెచ్ రామకృష్ణ, త్రిమూర్తులు, కె.గోవింద్ సురేష్, రత్నబాబు, దుర్గాప్రసాద్, డి.సత్యనారాయణ, వెంకట ప్రసాద్, జి.విజయకుమార్, నాగరాజు, కె.రాజు, సీహెచ్ నాగబాబు, ఎన్ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై రివ్యూ పిటిషన్

నరసాపురం: సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ నరసాపురం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, మాలల న్యాయ పోరాట సమితి నరసాపురం నియోజక వర్గ అధ్యక్షుడు సోడదాసి శ్రీధర్ రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. దీనికి సంబందించిన వివరాలను సోమవారం శ్రీధర్ పట్టణంలో తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది భరత్ మనుబర్వాల ద్వారా ఈ పిటీషన్ సుప్రీంకోర్టులో దాఖలు చేశామని చెప్పారు. మాలల హక్కులకు న్యాయం జరిగే వరకూ న్యాయ పోరాటం సాగిస్తామని చెప్పారు. సమావేశంలో సంఘ నేతలు మట్టా సుధీర్ మోహన్, వర్ధనపు ఏసురత్నం, మేడిది శ్రీమంత్, సోడదాసి రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.